క్లుప్తంగా

టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరిక



టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

పెరవలి: మండలంలోని అజ్జరం గ్రామంలో తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు ఆ పార్టీని వీడి వైఎస్సార్ సీపీ చేరారు. వైఎస్సార్ సీపీ నిడదవోలు ఎమ్మెల్యే అభ్యర్థి జి. శ్రీనివాస్ నాయుడు శనివారం ఈ గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. సర్పంచ్ గార్లపాటి నాగసుధ ఆధ్వర్యంలో తెలుగుదేశం నాయకులు వెదురాడ సత్యనారాయణ, సాన బోయిన స్వామి తదితరులు అక్కడకు వచ్చి వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్‌నాయుడు కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ర్యాలి బ్రహ్మాజీ, ఏలూరి శేషాచార్యులు, ముంగడ వీరాచార్యులు, గరగడాల రాంబాబు, పెచ్చెట్టి గణపతి, గుబ్బల శ్రీను, పెచ్చెట్టి నర్సింహమూర్తి తదితరులు ఉన్నారు.

నేడు ఐదు గ్రామాల్లో వనిత ప్రచారం

దేవరపల్లి: వైఎస్సార్ సీపీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి, రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత ఆదివారం గోపాలపురం మండలం సంజీవపురం, రేగులకుంట, బుచ్చింపేట, నందిగూడెం, జగన్నాథపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని ఆ పార్టీ మండల కన్వీనర్ పోతిరెడ్డి నాగరాజు శనివారం తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభం అవుతుందన్నారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

9 మంది వలంటీర్ల రాజీనామా

తాళ్లపూడి: మండలంలోని అన్నదేవరపేట-2, గజ్జరం సచివాలయాల్లో పని చేస్తున్న 9 మంది వలంటీర్లు శనివారం రాజీనామా చేశారు. వారంతా తమ రాజీనామా పత్రాలను తాళ్లపూడిలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో బి. వెంకట రమణకు అందజేశారు. ఎస్‌కే శిరీష బేగం, ఎస్‌కే బషీర్ బీబీ, ఎ.గంగామణి, ఆర్.రమాదేవి, ఆర్.సుధారాణి, ఈ.శ్రీదేవి, జె. చరిత తదితరులు రాజీనామా చేసిన వారిలో ఉన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి లూథరన్ ప్రచారం

నల్లజర్ల: కాంగ్రెస్ పార్టీ గోపాలపురం అసెంబ్లీ అభ్యర్థి మార్టిన్ లూథరన్ శనివారం మండలంలోని అనంతపల్లి, తెలికిచెర్ల, చోడవరం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. ఆయన వెంట పీసీసీ ప్రధాన కార్యదర్శి జేష్ట సతీష్ బాబు, కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు తొక్కుడు బియ్యపు ఫ్రాన్సిస్, కాకర్ల హరిబాబు, వెలగా రామకృష్ణ, గన్నిన రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమిశ్రగూడెంలో జనసేన అభ్యర్థి ప్రచారం

నిడదవోలు రూరల్: జనసేన పార్టీ నిడదవోలు అసెంబ్లీ అభ్యర్థి కందుల దుర్గేష్ శనివారం మండలంలోని సమిశ్రగూడెంలో ఎన్నికల ప్రచారం చేశారు. కమలం, గాజు గ్లాసు గుర్తులకు రెండు ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, జనసేన ఇన్‌చార్జ్ బీవీఎస్ఎన్ ప్రసాద్ పాల్గొన్నారు.

గామన్ బ్రిడ్జిపై ట్రాఫిక్‌కు అంతరాయం

కొవ్వూరు: గామన్ ఇండియా బ్రిడ్జి ఒక లైన్ బేరింగ్ మరమ్మతుల నిమిత్తం వాహనాల రాకపోకలను నిలిపి వేయడంలో శనివారం రాత్రి బ్రిడ్జికి ఇరువైపులా భారీ ఎత్తున ట్రాఫిక్ స్తంభించింది. టోల్ గేట్ వద్ద కిలోమీటర్ల పొడవునా వాహనాలు నిలిచిపోయాయి. దాంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్ నుంచి బయట పడడానికి సుమారు రెండు గంటల సమయం పట్టింది. మరో వైపు రోడ్డు కం రైలు వంతెనపై రాజమహేంద్రవరం నత్తగుళ్ల మలుపు వద్ద పనులు చేపడుతుండడంతో ట్రాఫిక్‌కికు ఇబ్బంది ఏర్పడింది.కొవ్వూరు పట్టణ పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

దేవరపల్లి: మండలంలోని బందపురం శివారున హైవే సమీపంలో గుర్తు తెలియని పురుషుని మృతదేహాన్ని శనివారం రాత్రి గ్రామస్తులు కనుగొన్నారు. మృతదేహం దుర్వాసన వెదజల్లడంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వ్యక్తి చనిపోయి మూడు, నాలుగు రోజులు అవుతుందని గ్రామస్తులు భావిస్తున్నారు. మృతుడి ఆచూకీ తెలియవలసి ఉంది.

'నాడు-నేడు' పనులపై అధికారుల సమీక్ష

నల్లజర్ల: మండలంలోని 33 పాఠశాలల్లో పూర్తి కావస్తున్న నాడు-నేడు పనులపై శనివారం అధికారులు సమీక్ష జరిపారు. వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, ఎంఈఓ-1 వై.సత్యనారాయణ, ఎంఈఓ-2 భగవతి ఈ సమీక్షలో పాల్గొన్నారు. సంబంధిత ఏఈ రాజ్‌కుమార్ మాట్లాడుతూ వివిధ పాఠశాలల్లో 57 అదనపు తరగతి గదుల నిర్మాణాలు 95 శాతం పూర్తయ్యాయన్నారు.

జగన్ పాలనలో ప్రతి ఇంటికీ లబ్ధి



దారవరం ప్రచారంలో వైఎస్సార్ సీపీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు, నాయకులు

- వైఎస్సార్ సీపీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు
- దారవరంలో ఇంటింటా ప్రచారం

చాగల్లు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఐదేళ్ల పాలనలో అర్హత గల ప్రతి కుటుంబానికీ మేలు జరిగిందని ఎమ్మెల్యే, ఆ పార్టీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు అన్నారు. మండలంలో దారవరంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శనివారం ప్రజాశీర్వాదం పేరుతో ఆయన ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి ఎమ్మెల్యే తలారి వెంకట్రావు గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చేసిన సంక్షేమం, అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. ప్రజా సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ ప్రతి ఓటరు గత టీడీపీ పాలన, ప్రస్తుత వైఎస్సార్ సీపీ పాలనను పోల్చి చూడాలన్నారు. చంద్రబాబు డ్వాక్రా రుణమాఫీ, రైతు రుణమాఫీ వంటి వాటి అమల్లో విఫలమై ఇప్పుడు సూపర్ సిక్స్ పేరుతో మళ్లీ మోసగించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అవినీతి, లంచాలకు ఆస్కారం లేకుండా ప్రజా సంక్షేమ పథకాలను అమలులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. ప్రచారంలో ఎంపీపీ మట్టా వీరాస్వామి, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్ష, గౌరవాధ్యక్షులు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, జుట్టా కొండలరావు, సర్పంచ్ మద్దుకూరి రవిప్రసాద్, ఎంపీటీసీ ఊబా గంగారత్నం, పార్టీ నాయకులు వుండవల్లి వెంకటేశ్వరరావు, ఊబా దుర్గారావు, కట్టా వెంకటేశ్వరరావు, ముప్పిడి మహాలక్ష్ముడు, కంకటాల శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అమలు చేయగలిగిన పథకాలే మేనిఫెస్టోలో..

- వైఎస్సార్ సీపీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి తానేటి వనిత
- మూడు గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం
- స్థానికుల స్వాగతాలు, బైక్ ర్యాలీలు



యర్నగూడెంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి, హోం మంత్రి తానేటి వనిత

దేవరపల్లి: సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని దీవించాలని వైఎస్సార్ సీపీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి, రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత ఓటర్లను అభ్యర్థించారు. శనివారం సాయంత్రం 4 నుంచి రాత్రి 11 గంటల వరకూ మండలంలోని యర్నగూడెం, సూర్యనారాయణపురం, త్యాజంపూడి గ్రామాల్లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచార రథంపై నుంచి వీధుల్లో ప్రజల నుద్దేశించి మాట్లాడారు. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా గత ఐదేళ్లుగా రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంక్షేమ పాలన అందించారని ఆమె తెలిపారు. అన్నివర్గాల ప్రజలకూ మేలు జరిగిందని, ఆ మేలును మర్చిపోకుండా మరలా జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ఐదేళ్లుగా మీ కుటుంబాలకు మంచి జరిగి ఉంటేనే ఫ్యాన్ గుర్తుకు ఓటెయ్యాలని ఆమె కోరారు. కూటమి పేరుతో మూడు పార్టీలు జత కట్టి మీ ముందుకు వస్తున్నాయని, వారి మాటలు నమ్మిమోసపోవద్దని వనిత కోరారు. జగనన్న విడుదల చేసిన 2024 ఎన్నికల మేనిఫెస్టోలో అమలు చేయగలిగిన పథకాలను పొందుపరిచారని ఆమె అన్నారు. నవరత్నాల అమలు యథాతథంగా కొనసాగుతాయని ఆమె చెప్పారు. మే 13న జరగనున్న పోలింగ్‌లో మీ రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను గెలిపించాలని కోరారు. ప్రచారంలో యర్నగూడెం, త్యాజంపూడి సర్పంచులు బొంతా భరత్‌బాబు, కుసులూరి స్వరూపరాణి, రాష్ట్ర పామాయిల్ బోర్డు డైరెక్టర్ నరహరిశెట్టి రాజేంద్రబాబు, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, కుసులూరి వెంకట సతీష్, పార్టీ బీసీ విభాగం జిల్లా కన్వీనర్ మేడిబోయిన గంగరాజు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, పార్టీ మండల మహిళా కన్వీనర్ కడలి హైమావతి, యువజన విభాగం జిల్లా కార్యదర్శి పోతుల కనకరాజు, గోపాలపురం ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ పాల్గొన్నారు. మంత్రి తానేటి వనితకు మద్దతుగా యర్నగూడెం, త్యాజంపూడి గ్రామాల్లో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. వీధుల్లో మహిళలు మంత్రి వనితకు హారతులు పట్టి, నుదుటన తిలకం దిద్ది ఆశీర్వదించారు. అడుగడుకున పూలజల్లు కురిపించి బ్రహ్మరథం పట్టారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక



టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే తలారి, రాజీవ్ కృష్ణ

కొవ్వూరు: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వైఎస్సార్ సీపీలోకి భారీ చేరికలు కొనసాగుతుండడం పార్టీ విజయానికి చిహ్నమని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, పార్టీ కొవ్వూరు నియోజకవర్గ పరిశీలకుడు ఎస్.రాజీవ్‌కృష్ణ అన్నారు. పశివేదల గ్రామంలో టీడీపీకి చెందిన మాజీ ఉప సర్పంచ్ యలమాటి సత్యనారాయణతో పాటు సుమారు 50 మంది టీడీపీ కార్యకర్తలు శుక్రవారం రాత్రి వైఎస్సార్ సీపీలో చేరారు. రాజీవ్‌కృష్ణ, వైఎస్సార్‌సీపీ రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్, కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయ ఢంకా మోగించడం ఖాయమని ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్ పేర్కొన్నారు. పోలింగ్ గడువు సమీపిస్తున్నందున నాయకులంతా సమష్టిగా పని చేయాలని ఎమ్మెల్యే వెంకట్రావు కోరారు. మల్లిన గోపి, పల్లి ధర్మరాజు, పల్లి వెంకటేశ్వరరావు, దాసరి అప్పారావు, కాకులపాటి అప్పారావు, కొడమంచిలి శ్రీనివాస్ తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు బొంత వెంకటలక్ష్మి, పార్టీ నాయకులు పరిమి సోమరాజు, ఉప్పలూరి సూరిబాబు, గారపాటి శ్రీనివాస్, గారపాటి వెంకటకృష్ణ, దాసరి రాయుడు, వేములపల్లి రామారావు, వైస్ ఎంపీపీ నూతంగి రేఖ, ముళ్లపూడి కాశీ విశ్వనాథ్, చాగల్లు ఎంపీపీ మట్టా వీరాస్వామి, ఆలపాటి రామకృష్ణ, మాజీ సర్పంచ్ పరిమి వెంకట్రావు, వేములపల్లి పూర్ణచంద్రరావు, ఉండవల్లి మునేశ్వరరావు, వేగి సూర్యారావు, నల్లా కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ జోరుకు కూటమి గల్లంతు ఖాయం

- మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ
- వైఎస్సార్ సీపీకి మద్దతుగా పట్టణంలో ప్రచారం



నిడదవోలు 8వ వార్డులో ప్రచారం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ, పార్టీ శ్రేణులు

నిడదవోలు: సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ జోరుకు కూటమి గల్లంతు ఖాయమని, సూపర్ సిక్స్ అంటూ టీడీపీ ఇచ్చే జిమిక్కు హామీలను ప్రజలు నమ్మడం లేదని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. పట్టణంలోని 8వ వార్డు చర్చిపేటలో శనివారం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్‌నాయుడు, రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్‌లను గెలిపించుకుంటే నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతున్నారు. ఈ ప్రచారంలో పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు ముంగండి కృపానందం, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, కౌన్సిలర్లు , వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు రూరల్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ముఖ్యమంత్రిగా మళ్లీ పట్టం కట్టేందుకు జనం సిద్ధంగా ఉన్నారని వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు అన్నారు. మండలంలోని పందలపర్రు, తాళ్లపాలెం, కంసాలిపాలెం, కోరుమామిడి, తాడిమళ్ల గ్రామాల్లో ఆ పార్టీ రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్‌నాయుడులకు మద్దతుగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఐదేళ్లుగా జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని గుర్తు పెట్టుకుని రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకే వేయాలని అభ్యర్థించారు. ప్రచారంలో సర్పంచులు కొండపల్లి శ్రీనివాస్, వులుమంతుల నాగదుర్గ, ముప్పిడి చంద్రశేఖర్, ఎంపీటీసీ సభ్యులు వీరప్రసాద్, కర్రి సుజాత, సొసైటీ అధ్యక్షులు యాళ్ల రామారావు, గంధం వెంకటరత్నం, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరంలో..

ఉండ్రాజవరం: వైఎస్సార్ సీపీ అభ్యర్థి జి.శ్రీనివాస్‌నాయుడు, ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్‌కు ఎ మద్దతుగా వేలివెన్నులో జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కర రామయ్య, శిరిగిన శివరాధాకృష్ణ, ఉండ్రాజవరంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, పాలంగిలో ఎంఎంసీ వైస్ చైర్మన్ వేలిచేటి జానకీరామయ్య, పాలాటి శరత్‌బాబు, సర్పంచ్ బొక్కా శ్రీనివాసు, దొడ్డా సూర్యనారాయణ, దమ్మెన్నులో సర్పంచ్ గురజర్ల సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు గెడ్డం రామకృష్ణ ఆధ్వర్యంలో శనివారం ప్రచారం చేశారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థుల రోడ్ షో



చాగల్లు మండలంలో రోడ్ షో నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు

చాగల్లు: ఏదైనా చెప్పారంటే ముఖ్యమంత్రి కచ్చితంగా దానిని అమలు చేస్తారని, చంద్రబాబు నాయుడు అందుకు పూర్తి విరుద్ధమని, ఈ విషయాన్ని ఇది ప్రజలు ఏనాడో గుర్తించారని వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం లోక్‌సభ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. శనివారం చాగల్లు మండలం దారవరం, మార్కొండపాడు, కుంకుడిమిల్లి, చంద్రవరం, మల్లవరం, గౌరిపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు, ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరు శ్రీనివాస్ భారీ బైక్ ర్యాలీగా రోడ్ షో నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ మట్టా వీరస్వామి, జెడ్పీటీసీ సభ్యురాలు గారపాటి విజయ దుర్గ, పార్టీ మండలశాఖ అధ్యక్ష, గౌరవాధ్యక్షులు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, జుట్టా కొండలరావు, సర్పంచులు మద్దుకూరి రవిప్రసాద్, మద్దిపాటి శ్రీరామ్మూర్తి, తాళ్లూరి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ లకంసాని సూర్యప్రకాశరావు, సొసైటీ అధ్యక్షులు గంగిశెట్టి వాసు, బండి అశోక్ బాబు తదితరులు పాల్గొన్నారు.

కూటమికి ఓటేస్తే సంక్షేమానికి చెల్లు



అజ్జరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్ నాయుడు

- వైఎస్సార్ సీపీ నిడదవోలు ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్ నాయుడు
- అజ్జరం, వెంకట్రాయపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం

పెరవలి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం కూటమికి ఓటు వేస్తే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండూ కుంటు పడతాయని వైఎస్సార్ సీపీ నిడదవోలు ఎమ్మెల్యే అభ్యర్థి జి. శ్రీనివాస్ నాయుడు అన్నారు. మండలంలోని అజ్జరం, వెంకట్రాయపురం గ్రామాల్లో శనివారం ఆయన జోరుగా ఎన్నికల ప్రచారం చేశారు. అడుగడుగునా మహిళలు హారతులు ఇచ్చి ఆయనకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ చంద్రబాబు మాటలను నమ్మితే నట్టేట ముంచేస్తాడన్నారు. పేదవాడికి సంక్షేమం అందాలంటే జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కుల మతాలకు అతీతంగా అన్ని వర్గాలకూ మేలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అన్నారు. ఎన్నికలు వచ్చినపుడే టీడీపీకి ప్రజలు గుర్తుకు వస్తారని, కరోనా ప్రబలినపుడు టీడీపీ వారెవరైనా మీ ముందుకు వచ్చారా? అని ఒక్కసారి ఆలోచించాలని ప్రజలను ఉద్దేశించి అన్నారు. ఐదేళ్ల పాలనలో అవినీతి మరక లేకుండా ఎమ్మెల్యేగా సాధ్యమైనంత వరకూ తాను ప్రజలకు మేలు చేశానన్నారు. అదే ధీమాతో మరోసారి అవకాశం ఇవ్వాలని కోరుతున్నానన్నారు. మీ ప్రాంతం, మీ ఊరు, మీ ఇల్లు అభివృద్ధిని చూసి ఓటు వేయాలని శ్రీనివాస్‌నాయుడు కోరారు. ఈ ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకే వేసి అభ్యర్థులను గెలిపించాలన్నారు. ప్రచారంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, అజ్జరం సర్పంచ్ గార్లపాటి నాగ సుధ, భూషణం, శ్రీనివాస్ రెడ్డి, భాస్కరరెడ్డి, నల్లిమిల్లి నాగిరెడ్డి, వెంకట్రాయపురం సర్పంచ్ పోలిశెట్టి బాలాజీ, వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

హోం ఓటింగ్‌పై సెక్టార్ ఆఫీసర్లకు శిక్షణ

నిడదవోలు: 85 ఏళ్ల వయసు పైబడిన వృద్ధులతో పాటు దివ్యాంగులకు ఇంటి వద్దే ఓటు వేసేందుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిందని తహసీల్దార్ వి.నాగభూషణం తెలిపారు. హోం ఓటింగ్‌పై ఎన్నికల సెక్టార్ ఆఫీసర్లకు శనివారం శిక్షణ తరగతులు నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉండ్రాజవరం, పెరవలి తహసీల్దార్లు నవీన్ కుమార్, సుధలు హోమ్ ఓటింగ్‌పై పలు సూచనలు చేశారు. మున్సిపల్ కమిషనర్ రాం భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తలారికి మద్దతుగా కుమార్తె షాలిని ప్రచారం



ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావుకు మద్దతుగా వేగేశ్వరపురంలో ప్రచారం నిర్వహిస్తున్న కుమార్తె షాలిని

తాళ్లపూడి: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరో దఫా ముఖ్యమంత్రిని చేసేందుకు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తన తండ్రి, వైస్సార్ సీపీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావును భారీ మెజార్టీతో గెలిపించాలని షాలిని కోరారు. తలారి వెంకటరావు కుమార్తె షాలిని మండలంలోని వేగేశ్వరపురంలో శనివారం సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావుతో కలిసి ఆ గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించి, ఓట్లు అభ్యర్థించారు. ఐదేళ్లలో ప్రభుత్వం అందజేసిన మంచిని వివరించే కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. తన తండ్రి వెంకట్రావును, రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌లను గెలిపించాలని కోరారు. ప్రచారంలో పార్టీ మండల మహిళా విభాగం అధ్యక్షురాలు ఎం. దమయంతి, నాయకులు పెండ్యాల మమత, శీర్ల బ్రహ్మానందం, నున్న కృష్ణ, శూలా పోశియ్య, వీరబాబు, పాతిరెడ్డి విష్ణు రావు, సందీప్, పెద్దిశెట్టి గండి, కృష్ణ, ఉప సర్పంచ్ మదన్ తదితరులు పాల్గొన్నారు.

మేరీమాత ఉత్సవాలు ప్రారంభం

తాళ్లపూడి: వేగేశ్వరపురంలోని నిత్య సహాయ గోదావరి మేరీమాత పుణ్యక్షేత్ర మహోత్సవాలు శనివారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. మేరీమాత తేరు ఊరేగింపు నిర్వహించారు. ఫాదర్ టి. జాన్ ఆధ్వర్యంలో పరిశుద్ధ జపమాల, దివ్య బలిపూజ జరిగాయి. వరంగల్ జీవధార డివైన్ నుంచి విచ్చేసిన రెవరెండ్ ఫాదర్ వీసీ జార్జ్ స్వస్థత ప్రార్థనలు చేశారు. గోదావరి మేరీమాత గాయక బృందం గీతాలు ఆలపించారు. ఆలయంలోని విగ్రహాలకు పూలమాలలు వేసి ఉత్సవాలను ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మేరీమాతకు కానుకలు సమర్పించారు. ఉత్సవాలు సందర్భంగా ఆలయాన్ని విద్యుత్తు దీపాలతో అలంకరించారు.

సారా, అక్రమ మద్యాన్ని నియంత్రించండి



నిడదవోలు ఎస్ఈబీ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న డిప్యూటీ కమిషనర్ శంకరయ్య

నిడదవోలు: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) నిడదవోలు స్టేషన్‌ను శనివారం ఎస్ఈబీ డిప్యూటీ కమిషనర్ ఎం.శంకరయ్య తనిఖీ చేశారు. స్టేషన్‌లోని పలు రికార్డులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందిని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యంగా ఉండరాదన్నారు. నియోజకవర్గ పరిధిలో సారా తయారీ, అమ్మకాలు, బెల్ట్‌షాప్‌ల ద్వారా మద్యం విక్రయాలు జరుగుతుందే పూర్తిగా నిరోధించాలన్నారు. ప్రస్తుతం ఎన్నికల మోడ్ ఆఫ్ కాండక్ట్ ప్రస్తుతం అమలులో ఉన్నందున విధుల్లో అలసత్వం తగదన్నారు. ఎక్కడైనా మద్యం అక్రమ నిల్వలు ఉంటే వాటిని గుర్తించి మద్యరహిత ఎన్నికల నిర్వహణకు నడుం కట్టాలని సూచించారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్ కె. వీరబ్రహ్మం, ఎస్సై దొరబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

దేవరపల్లి స్టేషన్‌లో..

దేవరపల్లి: ఎస్ఈబీ దేవరపల్లి స్టేషన్‌ను డిప్యూటీ కమిషనర్ శంకరయ్య శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించవద్దని సిబ్బందికి సూచించారు. జిల్లా సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలను ముమ్మరం చేయాలని ఆదేశించారు. నాటు సారా, అక్రమ మద్యంపై నిఘా పెట్టి కేసులు నమోదు చేయాలన్నారు. ఈ స్టేషన్ పరిధిలో పట్టుబడిన కేసులు, సీజ్ చేసిన మద్యం సీసాలు, వాహనాల వివరాలను డీసీ శంకరయ్య పరిశీలించారు. సీఐ కె. వెంకటేశ్వరస్వామి, ఎస్సై పి.సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు.